సాక్షి అనంతపురం

గురువారం । 25 । జనవరి । 2024



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
34.8°/ 17.3°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నిఘా మరింత పటిష్టం



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: ఎన్నికల వేళ మద్యం, నగదు, బంగారు నగలు అక్రమంగా తరలకుండా నిఘా మరింత పటిష్టం చేయాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. బుధవారం జిల్లా సెబ్ విభాగంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ త్వరలో జరుగునున్న ఎన్నికల సందర్భంగా అందరూ అప్రమత్తంగా పని చేయాలన్నారు. కర్ణాటక నుంచి జిల్లాలోకి లిక్కర్ అక్రమంగా తరలించకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాటుసారా తయారీ స్థావరాలు, సారా ఊటలను ధ్వంసం చేయాలన్నారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేయాలన్నారు. ఎస్పీతో పాటు సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ పాల్గొన్నారు.

డీటీఓగా రామాంజినేయులు



బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజనేయులు

అనంతపురం రూరల్: జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి(డీటీఓ)గా రామాంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న అన్నాదొరై పదోన్నతిపై శ్రీకాకుళం వెళ్లగా.. ఆయన స్థానంలో శ్రీసత్యసాయి డ్వామా పీడీ రామాంజనేయులను ప్రభుత్వం ఇటీవల అనంతపురం జిల్లా డీటీఓగా నియమించింది. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఫిబ్రవరి నుంచి 'పాల వెల్లువ'

అనంతపురం అర్బన్: 'జగనన్న పాల వెల్లువ' కార్యక్రమం కింద ఫిబ్రవరి 1 నుంచి 100 గ్రామాల్లో పాల సేకరణ ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 'పాల వెల్లువ' అమలుపై జేసీ బుధవారం తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మొదటి విడతగా కొర్రపాడు, రాచానపల్లిలో ప్రారంభించనున్న పాల శీతలీకరణ కేంద్రాల గురించి ఆరా తీశారు. వంద గ్రామాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు.

'గణతంత్రం' ఘనంగా నిర్వహించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. గణతంత్ర వేడుకల నిర్వహణకు పోలీసు పరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదానంలో తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కూర్చునేందుకు సౌకర్యంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, తహసీల్దార్ బాలకిషన్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

- 18 ఏళ్లు నిండిన వారు ఓటు కలిగుండాలి
- ఓటు దుర్వినియోగం చట్టరీత్యా నేరం
- ఎన్నికల కమిషన్ అవగాహన కార్యక్రమాలు
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



అనంతపురం అర్బన్: ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు పౌరులకు రాజ్యాంగం అందించిన వజ్రాయుధం 'ఓటు'. ఈ ఆయుధాన్ని ఉపయోగించి ఓ మంచి నాయకుడిని... తద్వారా ఓ మంచి ప్రభుత్వాన్ని నిర్మించుకోవడం ప్రతి ఓటరు బాధ్యత. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓటును దుర్వినియోగం చేయడం చట్టప్రకారం నేరంగా పరిగణిస్తారు. ప్రజలకు ఓటు గొప్పతనాన్ని తెలియజేసేందుకు భారత ఎన్నికల కమిషన్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో 'జాతీయ ఓటర్ల దినోత్సవం' ఒకటి. ఈ దినోత్సవాన్ని ప్రతి ఏటా జనవరి 25వ తేదీ నిర్వహిస్తారు. ఈ రోజున ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థపైన ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎన్నికల కమిషన్ కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

ఓట్లు... రకాలు

మీరు ఎవరికైనా ఓటు వేశావా అని అడిగితే... వేశాను అనో లేకపోతే వేయలేదనో చెబుతారు. ఇది సాధారణంగా వచ్చే సమాధానం. ఓటు వేయడంలో ఐదు రకాలు ఉన్నాయి. అవి ఏవంటే...

సాధారణ ఓటు : రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్ల వయస్సు నిండిన పౌరులు ఓటు హక్కు కలిగి ఉండాలి. ఎన్నికల్లో ఓటరు తన అభీష్టం మేరకు వేసే ఓటు సాధారణ ఓటు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు : ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, ఉద్యోగులు, డ్యూటీలో ఉండే ఆర్టీసీ డ్రైవర్లు, బందోబస్తు డ్యూటీలో ఉండే పోలీసులు తమకు ఓటున్న ప్రాంతానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోలేరు. ఇలాంటి వారి కోసం పోస్టల్ బ్యాలెట్ విధానం అమలు చేస్తారు. వీరు అందరికంటే ముందే తమ ఓటు హక్కును తపాలా బ్యాలెట్ పద్ధతి ద్వారా వినియోగించుకునే అవకాశం కల్పించారు.

సర్వీసు ఓటు: దేశ రక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉండే సైనికులు, పారా మిలిటరీ ఉద్యోగులు తమ సొంత రాష్ట్రానికి దూరంగా ఉంటారు. వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెసలుబాటు కల్పించారు. వీరిని సర్వీసు ఓటర్లుగా గుర్తిస్తూ వారి ఓటును సర్వీసు ఓటుగా పేర్కొంటారు. ఇలాంటి సర్వీసు ఓటర్లు జిల్లాలో 2,115 ఉన్నాయి.

ప్రాక్సీ ఓటు: కేంద్ర నిఘా సంస్థలు, గూఢచారి విభాగం ఉద్యోగులు సాధారణంగా తమ ఉనికిని ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచుతారు. ఇలాంటి వారు తమ ప్రతినిధిగా మరొకరిని పంపి ఓటు వేయిస్తారు. వారు ఎవరనేది బయటపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునే ఓటును ప్రాక్సీ ఓటు అంటారు.

టెండర్ ఓటు: జాబితాలో ఓటరు పేరుంటుంది. తన ఓటుహక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రంలోకి వెళతారు. అయితే వారి ఓటు అప్పటికే వేరొకరు వేసి వెళ్లారని గుర్తిస్తారు. అలాంటి సమయంలో తన ఉనికిని నిర్ధారిస్తూ... తాను ఓటు వేయలేదనే విషయంపై అధికారులను సంతృప్తి పర్చాలి. వారి ఆమోదం మేరకు వేసే ఓటును టెండర్ ఓటు అంటారు.

మీ ఓటు వివరాలు తెలుసుకోండిలా...

ఎన్నికల్లో ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు తమ ఓటు ఉందా లేదా అనే వివరాలు తెలుసుకోవాలి. ఇది పౌరుల వ్యక్తిగత బాధ్యత కూడా. ఓటు వివరాలు తెలుసుకునేందుకు భారత ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఒకవేళ ఓటు లేదని గుర్తిస్తే వెంటనే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు నమోదుకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసే చివరి రోజు వరకు అవకాశం కల్పించింది. ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి ఓటు హక్కు కల్పిస్తారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు వేసేలా అనుబంధ జాబితాలో చేరుస్తారు.

ఓటును ఫోన్ నంబర్‌తో అనుసంధానం

ఓటును మీ మొబైల్ ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవడం వల్ల ప్రయోజనం ఉంది. ఎవరైనా మీ ఓటును సవరించాలనో, తొలగించాలనో చూస్తే వెంటనే మెసేజ్ వస్తుంది. ఓటును ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ వెబ్‌లింక్‌లను అందుబాటులో ఉంచింది.

డీఎస్ఈ ద్వారా గుర్తింపు

చట్టపరంగా ఒకటికి మించి ఓట్లు కలిగి ఉండకూడదు. రెండు అంతకు మించి కలిగి ఉన్న ఓటన్లు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా తొలగింపు ప్రక్రియ నిర్వహిస్తారు. ఎన్నికల కమిషన్ అందించిన డీఎస్ఈ (డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్) విధానం ద్వారా ఓట్ల మ్యాచింగ్ ప్రక్రియను నియోజకవర్గం వారీగా చేపడతారు. నియోజకవర్గం పరిధిలో ఓట్లను డీఎస్ఈ సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేస్తారు. ఈ క్రమంలో ఒకే రకమైన ఫొటో, పేరు, తండ్రిపేరు, ఉన్న ఓట్లను ఒక దగ్గరకు తీసుకొస్తుంది. అలా వచ్చిన డబుల్, అనుమానాస్పద ఓట్లపై విచారణ నిర్వహించి తొలగిస్తారు.

దివ్యాంగుల కోసం...

దివ్యాంగులు, వయసు 80 ఏళ్లు పైబడిన వారు రానున్న ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. జిల్లాలో ఎన్నికల సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటు హక్కు కలిగిన 27,817 దివ్యాంగులను గుర్తించారు. ఇక వయసు 80 ఏళ్లు ఆపై ఉన్నవారు 26,953 మంది ఉన్నారు. రానున్న ఎన్నికల్లో వీరు ఇంటి నుంచి ఓటు హక్కును విని‌నియోగించుకునే విషయంపై మార్గదర్శకాలను ఎన్నికల కమిషన్ జారీ చేస్తుంది.

జిల్లాలో ఓటర్ల వివరాలు..	
మొత్తం ఓటర్లు	19,94,544
పురుష ఓటర్లు	9,88,176
మహిళ ఓటర్లు	1,06,123
థర్ జెండర్ ఓటర్లు	245
పోలింగ్ కేంద్రాలు	2,213

వయసు వారీ ఓటర్లు ఇలా...	
వయసు	ఓటర్ల సంఖ్య
18-19	36,837
20-29	3,54,,838
30-39	5,83,133
40-49	4,25,309
50-59	2,95,931
60-69	1,79,991
70-79	91,542
80 ఏళ్లు ఆపై	26,963

ఓటు 'అమూల్యం'



నచ్చిన నాయకులను ఎన్నుకునేందుకు, మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు రాజ్యాంగం పౌరులకు ఓటు హక్కు కల్పించింది. అమూల్యమైన ఓటును పౌరులు ఎన్నికల్లో తప్పనిసరిగా వినియోగించుకోవాలి. ముఖ్యంగా జనవరి ఒకటో తేదీకి వయసు 18 ఏళ్లు నిండనున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. ఓటు ప్రాధాన్యత.. సద్వినియోగంపై ప్రజల మధ్య విస్తృత చర్చ జరిగాలి. అప్పుడే ఓటుకు ఔన్నత్యం సంతరించుకుంటుంది.

– గౌతమి, కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు పూర్తిస్థాయిలో ఉండాలి



పోలింగ్ కేంద్రంలో వసతులపై అధికారులకు సూచనలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: పోలింగ్ కేంద్రాల్లో వసతులు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పరిధిలో 67, 169 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న అరవింద్ ఘోష్ నగర పాలక పాఠశాల, భాష్యం పాఠశాల భవనాలను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులు ఏ మేరకు ఉన్నాయనేది పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, తహసీల్దార్ బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

నోటా...



ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఏ ఒక్కరూ సరైన వారు కారని ఓటర్లు భావించినప్పుడు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని భారత ప్రభుత్వం కల్పించింది. నోటా (నన్ ఆఫ్ ది ఎబోవ్) ఆప్షన్ తీసుకొచ్చింది. అభ్యర్థుల్లో ఎవరితోనూ సంతృప్తి చెందని వ్యక్తులకు ఇది కీలకమైన ఓటు. నోటా ఓటింగ్ అంటే అభ్యర్థులు ఎవరూ సరిపోరు. నోటా ఓట్లనూ లెక్కిస్తారు. అయితే మెజారిటీ ఓట్లు నోటా అయితే.. తదుపరి అతిపెద్ద మెజారిటీ ఉన్న పార్టీని ఎన్నుకుంటారు..

ఎస్కేయూ క్యాంపస్‌లో కొత్త కోర్సులు

- బీటెక్‌లో ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్సెస్ బ్రాంచ్‌లు
- ఒక్కో కోర్సుకు 60 సీట్ల చొప్పున కేటాయింపు
- ఎంటెక్‌లోనూ కొత్తగా మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులు
- అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం



అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: సాంకేతిక విద్య కొత్త పుంతలు తొక్కుతోంది. ఇంజినీరింగ్ కోర్సుల్లో సమూల మార్పులు వస్తున్నాయి. ఇందులో భాగంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో సరికొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నారు. ఇప్పటిదాకా మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సులు ఉన్నాయి. వీటికి తోడు 2024–25 విద్యా సంవత్సరం నుంచి బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ అండ్ ఎంఎల్), డేటా సైన్సెస్ కోర్సులు ప్రవేశపెట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏఐసీటీఈ నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. నూతన కోర్సుల అమలుపై బుధవారం అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించి ఇందులో నిర్ణయం తీసుకున్నారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులైన ఎస్కేయూ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్లు సి.శోభాబిందు, పి.సుజాత, కృష్ణా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ కేబీ చంద్రశేఖర్, ప్రొఫెసర్ బి.నాగభూషణరాజు పాల్గొన్నారు. బీటెక్ కంప్యూటర్ సైన్సెస్‌లో రెండు కొత్త కోర్సులు అమలు చేయాలని నిర్ణయించారు. కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఒక బ్రాంచ్‌కే పరిమితం చేయకుండా మూడు బ్రాంచ్‌లు అమలు చేయాలని పేర్కొన్నారు. తాజాగా ప్రవేశపెట్టే కోర్సుల్లో 60 సీట్లు భర్తీ చేసుకోవచ్చునని సిఫార్సు చేశారు. అదే విధంగా సీఎస్ఈ, ఈసీఈ కోర్సుల్లో ఇప్పటికే ఉన్న 60 సీట్లను 120 సీట్లకు పెంపుదల చేసుకోవచ్చునని వీసీ పేర్కొన్నారు.

ఎంటెక్‌లోనూ రెండు కోర్సులు

ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్‌లో రెండు కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులను 2024–25 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు. ఈ కోర్సుల్లో బోధించడానికి అధ్యాపకులను కాంట్రాక్టు బేసిక్ విధానంలో తీసుకోవాలని నిర్ణయించారు. ఫాదర్ విన్సెంట్ భవనం రెండో అంతస్తులో ఎంటెక్ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది.

అడ్మిషన్లకు ఫుల్ డిమాండ్

ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదవాలనే ఆకాంక్ష ఎంతో మంది విద్యార్థులకు ఉంది. ఈ క్రమంలో అదనంగా బీటెక్‌లో బ్రాంచ్‌లు ఏర్పడితే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యార్థులకు గొప్ప సదవకాశం లభిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది. ఈఏపీసెట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు మొదటి ఆప్షన్ ఈ కళాశాలకే ఇస్తుండడంతో వారికే సీట్లు లభిస్తున్నాయి. ఇక్కడ చదువుకున్న వారిలో ఏటా 120 మందికి పేరెన్నిక గల బహుళజాతి సంస్థల్లో కొలువులు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా దక్కుతున్నాయి.

క్యాంపస్ కాలేజీ బలోపేతానికి చర్యలు

క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల బలోపేతం దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. 2024–25 విద్యా సంవత్సరం నుంచి బీటెక్‌లో రెండు కోర్సులు, ఎంటెక్‌లో రెండు కొత్త కోర్సులు అమలు చేయనున్నాం. మార్కెట్ డిమాండ్ దృష్ట్యా విద్యార్థులకు కోర్సులు పూర్తికాగానే కొలువులు దక్కే కోర్సులను రూపకల్పన చేయాలని భావించాం. ఈ మేరకు అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం.

– హుస్సేన్ రెడ్డి, వీసీ, ఎస్కేయూ

యునెస్కో గుర్తింపునకు కృషి



చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రమానందన్

లేపాక్షి: ప్రపంచ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని ఆలయ పాలక మండలి నూతన చైర్మన్ కరణం రమానందన్ పేర్కొన్నారు. ఆలయ చైర్మన్‌గా బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవదాయ శాఖ అధికారులు నరసింహరాజు, నరసింహమూర్తి సమక్షంలో చైర్మన్‌గా రమానందన్, సభ్యులుగా హెచ్.నరసింహమూర్తి, ఎం.మంజుల, బి.శంకరప్ప, కె.శాంతమ్మ, జి.సాయిలీల, బి.నాగరాజు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చోళసముద్రం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం నాయకుడు గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, బిసలమానేపల్లి సర్పంచ్ నాగేంద్రబాబు, సింగిల్ విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బషీర్, నాయకులు నిస్సార్, సిరాజ్, బోర్ల అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రసాద్‌కు ప్రధాని మోదీ అభినందన





రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుని, ప్రధాని నుంచి అభినందనలు అందుకున్న సూర్యప్రసాద్

పరిగి: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు అందుకున్న ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి విద్యార్థి రాగే సూర్యప్రసాద్‌ను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లిలో 5వ తరగతి చదువుతున్న రాగే సూర్యప్రసాద్, గతేడాది కిలి మంజారోతో పాటు లద్దాఖ్‌లోని దక్షిణ పుల్లు పర్వతాన్ని అధిరోహించాడు. దీంతో కేంద్ర ప్రభుత్వం స్పోర్ట్స్ విభాగంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 22న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు అందజేశారు. సూర్యప్రసాద్‌తో పాటు రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రాత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూర్యప్రసాద్‌ను అభినందించారు. తమ విద్యార్థి జాతీయ స్థాయి అవార్డు దక్కడం సంతోషంగా ఉందని ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్, ఉపాధ్యాయులు అన్నారు.

కదిరి వేరుశనగకు జాతీయ గుర్తింపు

- వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ శారదా జయలక్ష్మీదేవి



కదిరి వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చిస్తున్న వ్యవసాయ వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మీదేవి

కదిరి: లాభదాయకమైన వేరుశనగ నూతన వంగడాలను సృష్టిస్తున్న కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం దేశానికే తలమానికమని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం ఆమె కదిరి వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించి శాస్త్రవేత్తలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అధిక దిగుబడినిచ్చే కదిరి–6 (కే–6) లాంటి నూతన రకం వంగడం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉందన్నారు. వేరుశనగను ఆశిస్తున్న పురుగులు, తెగుళ్లను నివారించేందుకు ప్రకృతి సిద్ధమైన జీవ నియంత్రణ పద్ధతులపై పరిశోధనలు సాగించాలని సూచించారు. కదిరి లేపాక్షి, కే–6 రకాలు దేశవ్యాప్తంగా 60 నుంచి 70 శాతం సాగులో ఉన్నాయన్నారు. అనంతరం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ మాట్లాడుతూ కదిరి పరిశోధన స్థానంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మరింత మంది శాస్త్రవేత్తలు, సిబ్బందిని నియమించాలని ఆయన వైస్ చాన్సలర్‌ను కోరారు. పరిశోధనల కోసం విత్తనాభివృద్ధి చేసేందుకు మరో 100 ఎకరాల భూమి అవసరమన్నారు. ఇందుకు ఉపకులపతి స్పందిస్తూ పరిశోధన స్థానం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వేరుశనగ శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రసన్న రాజేష్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

అనంతపురం టౌన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ తిరుపతి కార్పొరేట్ కార్యాలయ విజిలెన్స్ అధికారి శ్రీనివాసబాబు హెచ్చరించారు. జిల్లా విజిలెన్స్ అధికారులతో బుధవారం రాప్తాడులోని పలు విద్యుత్ సర్వీసులను ఆయన తనిఖీ చేశారు. 7.5హెచ్‌పీ మోటార్‌కు అక్రమంగా విద్యుత్‌ను వాడుతుండడంతో పాటు మరో ఇంటికి మీటరు నుంచి కాకుండా నేరుగా విద్యుత్ కనెక్షన్ తీసుకున్నట్లు గుర్తించి సంబంధీకులపై కేసులు నమోదు చేసి, రూ.5 లక్షలు జరిమానా విధించారు. అనంతరం మండల విద్యుత్ అధికారులతో కలసి విద్యుత్ పొదుపుపై మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు గోపి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు అండగా ఉందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి (చిత్రంలో) అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శంకరనారాయణ, తదితరులు



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

- మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం
- ఈ నెల 27 నుంచి అనంతలో ఇంటింటా వైఎస్సార్‌సీపీ కార్యక్రమం
- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సంక్షేమం, అభివృద్ధిని అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉందామని పార్టీ శ్రేణులకు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలకు మరో 80 రోజుల గడువున్న ప్రస్తుత తరుణంలో సమష్టి కృషితో మరోసారి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమంపై అనంతపురంలోని అంబేడ్కర్ భవన్ వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు.

సంక్షేమం, అభివృద్ధిని వివరిద్దాం

ఈ నెల 27న పాతూరు నుంచి ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమాన్ని, అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపలేదన్నారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలో రూ.2,300 కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందించారన్నారు. నగరంలో రోడ్లు, కాలువలు, ఆస్పత్రులు, పాఠశాలలు, తదితర అభివృద్ధి పనులకు రూ.1,045 కోట్లు వెచ్చించారని గుర్తు చేశారు. ప్రజల సంక్షేమానికి, ప్రాంతాల అభివృద్ధికి గతంలో ఎన్నడూ ఇంత పెద్ద ఎత్తున నిధులు వెచ్చించ లేదన్నారు. ఇదే అంశాన్ని వివరిస్తూ కరపత్రాన్ని రూపొందించి ఇంటింటికీ వెళ్లి తెలియజేద్దామంటూ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గడపకు వెళ్లి మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరుదామన్నారు. చంద్రబాబు హయాంలో టీడీపీ నాయకుల దయాదాక్షిణ్యాలపై ప్రజాసంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి ఆధారపడి ఉండేదన్నారు.

వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షలు

ఇటీవల మృతి చెందిన అనంతపురంలోని ఎర్రనేల కొట్టాల వలంటీర్ మహమ్మద్ రఫీ కుటుంబానికి జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను మృతుడు భార్య షర్మిలకు ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి బుధవారం అందజేశారు.

కుట్రలను తిప్పికొడదాం

దేశంలో ఏ ముఖ్యమంత్రీ అందివ్వని సంక్షేమం, అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో సాధ్యం చేసి చూపించారని అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులుకావాలన్నారు. ప్రజలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించాలన్నారు. ప్రస్తుతం నగరంలోనే తాను నివాసం ఏర్పాటు చేసుకున్నానని, ప్రజలందరికీ అందుబాటులో ఉంటానన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ ఎన్నికల హామీలను 98.5 శాతం అమలు చేసి పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్డీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, కృష్ణవేణి, నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చింతా సోమశేఖరరెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, మధు, జగదీష్, నాయకులు కృష్ణమూర్తి, పెన్నోబులేసు, వనరస బలరాం, రామయ్య, శోభాబాయి, శోభారాణి, ఉష, అంజలి, అనిత, పార్వతి, దేవి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి మృతి



మృతుడు జీవన్‌కుమార్

ముద్దనూరు: ఈ నెల 20న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జీవన్‌కుమార్(16) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వైఎస్సార్ జిల్లా ముద్దనూరు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపిన మేరకు... తాడిపత్రికి చెందిన జీవన్‌కుమార్... తన స్నేహితుడు మోక్షేశ్వర్‌రెడ్డితో కలసి ఈ నెల 19వ తేదీ కడపలో ఉన్న మిత్రుడిని కలిసేందుకు వెళ్లారు. తిరిగి 20వ తేదీ సాయంత్రం ద్విచక్ర వాహనంపై తాడిపత్రికి బయలుదేరారు. ముద్దనూరు మండలం చింతకుంట గ్రామ సమీపంలోకి చేరుకోగానే వాహనం నడుపుతున్న జీవన్‌కుమార్ వేగ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతల్లో దూసుకెళ్లారు. ఘటనలో గాయపడిన ఇద్దరినీ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక బుధవారం జీవన్‌కుమార్ మృతి చెందాడు.

వ్యక్తి ఆత్మహత్య



కిరణ్‌కుమార్ మృతదేహం

తాడిపత్రి: మానసిక ఒత్తిళ్లు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.... తాడిపత్రిలోని జయనగర్ కాలనీకి చెందిన ఆంజనేయులు కుమారుడు పుట్ట కిరణ్‌కుమార్ (33) కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ క్రమంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనైన ఆయన... జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం తాడిపత్రి మండలం చల్లవారిపల్లి సమీపంలో పట్టాలపై చేరుకుని రైలు ఇంజన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎంపీడీఓలకు స్థానచలనం?

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిధిలోని 30 నుంచి 40 మంది ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేయనున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బదిలీలు చేసేందుకు జిల్లా యంత్రాంగం జాబితా సిద్ధం చేసింది. ఈ జాబితాను జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి అధికారులకు జెడ్పీ అధికారులు పంపారు. ఎన్నికల సంఘం ఆమోదం పొందిన తర్వాత అధికారికంగా ఉత్తర్వులు వెలువడించనున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రక్రియ కొలిక్కి రానున్నట్లు జెడ్పీ అధికారులు పేర్కొన్నారు.

జనవాక్కు

ఆసరాతో ఆదుకున్నారు



మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. ఆసరా పథకం కింద ఏటా మా గ్రూపు సభ్యుల్లో ఒక్కొక్కరికి రూ.10,850 చొప్పున పది మందికి అందింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మాకు ఆసరా పథకం ద్వారా రుణమాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్‌కు మేమెంతో రుణపడి ఉన్నాం. గత ప్రభుత్వంలో రుణమాఫీ పేరుతో అప్పటి సీఎం చంద్రబాబు మమ్మల్ని మోసం చేశాడు. రుణాలు చెల్లించలేక చాలా మంది బ్యాంక్‌ల్లో డీఫాల్టర్లుగా మారారు. సీఎం వైఎస్ జగన్‌తో మాకు బ్యాంక్‌ల్లో గౌరవ మర్యాదలు పెరిగాయి. మళ్ళీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– ఎం.జి.సుమంగళమ్మ, బ్రహ్మసముద్రం

ఆర్థిక ఇబ్బందులు తీరాయి



పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్న నాకు గత ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమ పథకాలు వర్తించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆసరా పథకం, రైతు భరోసా, మా కుమార్తెకి వసతి దీవెన వర్తించింది. సంక్షేమ పథకాల కింద నా బ్యాంక్ ఖాతాకు జమ చేసిన డబ్బుతో రెండు ఎనుములు, ఓ ఆవు కొనుగోలు చేశాం. ప్రస్తుతం రోజూ 14 లీటర్ల పాలను మార్కెట్‌కు తరలించడం ద్వారా నెలకు రూ.21 వేల ఆదాయం వస్తోంది. దీంతో పాటు పశువుల ఎరువును మా తోటకు వినియోగించుకుంటున్నాం. దీంతో రసాయనిక ఎరువుల అవసరం లేకుండా పోయింది. కుమార్తెను ఎంబీఏ చదివిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులూ తీరాయి. ఇదంతా సీఎం వైఎస్ జగన్ చలువతోనేనని గర్వంగా చెబుతున్నా.

– కోనా వరలక్ష్మి, కోనుప్పలపాడు, యాడికి మండలం

అండగా నిలిచారు



పూల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నా. నాలుగేళ్ల క్రితం మా మహిళా పొదుపు సంఘం సభ్యులు తీసుకున్న రుణాన్ని విడతల వారీగా సీఎం వైఎస్ జగనన్న మాఫీ చేశారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద ఏటా రూ.6వేలు చొప్పున నగదు నా బ్యాంక్ ఖాతాలోకి జమ చేస్తూ వచ్చారు. ఈ ఏడాది కూడా రూ.60 వేలు రుణం తీసుకున్నా. ఈ డబ్బుతో వ్యాపారం చేసుకుంటున్నా. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరం చేసి, మాకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగనన్నకే మా మద్దతు.

– వెంకటలక్ష్మి, గుంతకల్లు

ఆసరాతో కొండంత అండ



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి. ఇప్పటి వరకూ నాకు నాలుగు విడతలుగా ఆసరా మొత్తం జమ అయింది. 2019 ఎన్నికల సమయానికి మా సంఘానికి రూ.5 లక్షల రుణం ఉండగా... ఈ రోజుతో అది కాస్త తీరిపోయింది. సంఘంలో మళ్లీ రుణం తీసుకునే అవకాశం కల్పించారు. అన్ని విధాలుగా అండగా నిలిచిన జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

– ప్రభావతి, లేపాక్షి

డీఆర్‌ఎం సుడిగాలి పర్యటన



అనంతపురం రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం వినీత్‌సింగ్, అధికారులు

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) వినీత్‌సింగ్ బుధవారం డివిజన్ పరిధిలో సుడిగాలి పర్యటన గావించారు. ఆయనతో పాటు సీనియర్ డీసీఎం మనోజ్, డీఈఎన్ గంగరాజు, డీఈఎన్ (వెస్ట్) ఎస్.మణికంఠ, ఆయా సెక్షన్ల ఏడీఈఎన్‌లు ఉన్నారు. ప్రత్యేక రైలులో అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లిరోడ్డు, రేణిగుంట రైల్వేస్టేషన్లను సందర్శించారు. ఆయా స్టేషన్లలో అమృత్ రైల్వేస్టేషన్ స్కీమ్ కింద చేపట్టిన ఆధునీకరణ పనులు పరిశీలించారు. కొత్త లైన్లు, హైలెవల్ ప్లాట్‌ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, పార్కింగ్ స్థలాలు, మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. కదిరి రైల్వేస్టేషన్ ప్రవేశం వద్ద ఐరన్ పైపులతో ఏర్పాటు చేసిన కల్వర్టు దెబ్బ తిన్న విషయం గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

పనుల జాప్యంపై సీరియస్

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్ విస్తరణ పనుల్లో చోటు చేసుకున్న జాప్యంపై డీఆర్‌ఎం వినీత్‌సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతకల్లు డీఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బుధవారం ఆయన అనంతపురం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ప్రత్యేక రైలులో చేరుకున్న ఆయన రైల్వే స్టేషన్ అంతా కలియతిరిగారు. విస్తరణ పనులు మందకొడిగా సాగుతుండడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వీఐపీ లాంజ్‌లో ఫినిషింగ్ పనులు సరిగా లేకపోవడం, 4వ ప్లాట్‌ఫాంలో గుంతలు ఎక్కువగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైల్వే స్టేషన్ ముందు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, ఎటు చూసినా మందు బాటిళ్లు పడి ఉండడంతో అధికారులపై మండిపడ్డారు. రైల్వే ఉద్యోగుల క్వార్టర్స్ పరిసరాల్లో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని డీఆర్‌ఎంకు రైల్వే ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆయన సీరియస్‌గా పరిగణించారు. మందుబాబులతో పాటు అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని ఆర్‌పీఎఫ్ అధికారులను ఆదేశించారు. జంగిల్ క్లియరెన్స్ తోపాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట అనంతపురం స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, ఏఈఎన్ విల్సన్‌బాబు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రమేష్‌రెడ్డి, ఇతర విభాగాల ఉద్యోగులు ఉన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

- ఆర్డీటీ అసోసియేట్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్



సమావేశంలో మాట్లాడుతున్న అన్నే ఫెర్రర్

బత్తలపల్లి: అభాగ్యులకు సాయపడే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకున్నపుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్డీటీ అసోసియేట్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ అన్నారు. అంతర్జాతీయ రిలే అల్ట్రా మారథాన్ ముగింపు సమావేశం బుధవారం బత్తలపల్లిలోని ఆర్డీటీలో ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అన్నేఫెర్రర్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారిత డైరెక్టర్ విశాల ఫెర్రర్, అనంతపురం అల్ట్రా మారథాన్ ప్రమోటర్ జువాన్ మాన్యుయెల్ వైరా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్డీటీని స్థాపించి 50 సంవత్సరాలకు పైగా అయిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నదే సంస్థ లక్ష్యమన్నారు. అల్ట్రా మారథాన్ పరుగును జిల్లాలో చేపట్టి అభాగ్యులకు అండగా నిలిచిన హువాన్ మాన్‌వెల్‌ను అభినందించారు. రాబోవు రోజుల్లోనూ ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. మారథాన్‌లో పాల్గొన్న 67 మంది స్పెయిన్, అర్జెంటీనా దేశస్తులతో పాటు 65 మంది భారతదేశానికి చెందిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. జువాన్ మాన్యుయెల్ వైరా మాట్లాడుతూ వారం రోజులుగా కొనసాగిన మారథాన్ పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 'ఒక కిలోమీటరు–ఒక జీవితం' అంటూ మారథాన్ రన్ చేపట్టినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన నిధితో ఓ పేద చిన్నారిని ఆర్డీటీ దత్తతకు తీసుకుని ఉన్నత చదువులు చదివిస్తుందని, వివిధ అభివృద్ధి పనులకు నిధులను వెచ్చించి పేదరికం నిర్మూలనకు కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో జరిగే పదో మారథాన్‌లో అందరమూ కలుసుకుందామని పిలుపునిచ్చారు. బృహత్తరమైన ఈ కార్యక్రమం ద్వారా చాలా మంది జీవితాల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. అనంతరం హువాన్ మాన్‌వెల్, అన్నేఫెర్రర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్పాన్సర్ షీబా, ఆర్డీటీ డైరెక్టర్లు నిర్మల్, సాగర్‌మూర్తి, నాగప్ప, సాయికృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, శివప్ప, సాయి, రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి సిబ్బంది, స్పానిస్, అర్జెంటీనా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన అల్ట్రా మారథాన్

కుందుర్పి: మండల కేంద్రంలోని ఫాదర్ ఫెర్రర్ ఆలయం నుంచి మంగళవారం ప్రారంభమైన అల్ట్రా మారథాన్ రన్ బుధవారం ముగిసింది. ఈ మేరకు స్థానిక ఆర్డీడీ ఏటీఎల్ నారాయణస్వామి, స్పాన్సర్ డైరెక్టర్ షీబా తెలిపారు. కుందుర్పి, నిజవళ్లి తదితర 15గ్రామాల మీదుగా మొత్తం 170 కిలోమీటర్లు సాగిన మారథాన్ బుధవారం ఉదయం 10 గంటలకు బత్తలపల్లికి చేరుకుంది.

వైద్య కళాశాలకు దేహదానం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మార్చురీలో ఉన్న ఓ మృతదేహాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలకు అందించేలా సాయి ట్రస్ట్ సభ్యులు చొరవ తీసుకున్నారు. మృతుడి బంధువులు, స్నేహితుల అంగీకారంతో బుధవారం వైద్య కళాశాలలోని అనాటమీ విభాగానికి మృతదేహాన్ని అప్పగించారు. వివరాలు... తాడిపత్రిలోని పోరాటాల కాలనీకి చెందిన జి.వెంకటేష్(37) అవివాహితుడు. పినతల్లి ప్రమీల వద్ద ఉంటూ వంట పనితో జీవనం సాగించేవాడు. ఈ నెల 16న అధిక రక్తపోటుతో మెదడులోని నరాలకు ఇబ్బంది కలిగి మృతి చెందాడు. బంధువులు ఎవరూ రాకపోవడంతో మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. పోలీసుల జోక్యంతో వెంకటేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న పినతల్లి ప్రమీల, మిత్రుడు రాజశేఖర్ తదితరులు బుధవారం మార్చురీకి చేరుకుని వైద్య కళాశాలకు మృతదేహం అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ శంకర్‌నాయక్, సాయి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుడి దుర్మరణం



అజయ్ (ఫైల్)

రాయదుర్గం టౌన్: ఆటో ఢీకొన్న ఘటనలో గార్మెంట్స్ పరిశ్రమ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని ఇరుమాల్ వీధిలో నివాసముంటున్న కురుబ అజయ్ (40)కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం బళ్లారి రోడ్డులో నడుచుకుంటూ వెళుతుండగా గంగమ్మబావి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీకొని, అదుపు తప్పి అతనిపై పడింది. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

ఉరవకొండ: కుటుంబ సమస్యలతో విసుగు చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్న కురుబ చంద్రశేఖర్ (48) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబంలో సమస్యలతో సతమతమవుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కొంత కాలంగా తల్లి వద్దనే ఉంటూ వచ్చాడు. మంగళవారం రాత్రి తన ఇంటికి చేరుకున్న చంద్రశేఖర్.. ఇంటి ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన పొరుగింటి వారు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: బాలికను లైంగికంగా వేధించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తాడిపత్రి అర్బన్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలను బుధవారం రాత్రి ఆయన వెల్లడించారు. తాడిపత్రిలోని ఆంజనేయస్వామి ప్రాంతానికి చెందిన యువకుడు సురేంద్ర, అదే కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలికను రెండు రోజుల క్రితం లైంగిక వేధింపులకు గురి చేశాడు. బాలిక ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం సురేంద్రపై 354ఏ, 452 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలీ మృతి

అనంతపురం క్రైం: బతుకు తెరువు కోసం వలస వచ్చిన ఓ కూలీ అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆస్పరి మండలం బినిగేరి గ్రామానికి చెందిన ఈరన్న(32)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో పని కోసం అనంతపురానికి వలస వచ్చిన ఆయన వారం రోజులుగా కనిపించకుండా పోయాడు. దీనిపై కుటుంబసభ్యులు వారం రోజుల క్రితమే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 22న మిస్సింగ్ కేసు నమోదు చేసి, పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం సర్వజనాస్పత్రి ఆవరణలోని అరుగుపై విగతజీవిగా పడి ఉన్న ఈరన్నను ఔట్‌పోస్టు పోలీసులు గుర్తించి, గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద తొలుత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాధిత కుటుంబసభ్యులు తెలిపిన ఆనవాళ్లతో మృతుడి పోలికలు సరిపోయాయి. దీంతో పోలీసుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు బుధవారం ఆస్పత్రికి చేరుకుని మృతుడిని ఈరన్నగా నిర్ధారించారు. ఎలాంటి అనారోగ్యం లేని తన భర్త మృతి చెందడంపై భార్య అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహిళపై దున్నపోతు దాడి

- 3 నెలల్లో 60 మందికిపైగా క్షతగాత్రులు



దాడి చేసిన దున్నపోతు ఇదే..

కణేకల్లు: మండలంలోని సొల్లాపురంలో ఓ దున్నపోతు రెచ్చిపోయింది. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ... తనను కొట్టిన వారిని గుర్తు పెట్టుకుని కుమ్మేస్తోంది. ఈ క్రమంలో అల్లీపీరా స్వామి భజన మందిరం వద్ద నివసిస్తున్న రసూలమ్మ బుధవారం ఉదయం ఇంటి బయట అరుగుపై కూర్చొని ఉండగా దున్నపోతు దాడి చేసింది. కొమ్ములతో ఎత్తి పారేసింది. ఘటనతో ఆమె కుడి కాలు పాదం నుంచి మోకాలి వరకూ చీరుకుపోయింది. దాడిని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై దున్నపోతును తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన రసూలమ్మను అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

కసితో దాడి చేస్తున్న దున్న

ఆరు నెలల క్రితం సొల్లాపురానికి చేరుకున్న దున్నపోతును గమనించిన స్థానికులు తొలుత అమ్మోరి పోతు అనుకున్నారు. ఈ క్రమంలో దానిని ఎవరూ ఏమి అనకుండా మిన్నకుండి పోయారు. గ్రామంలోనే సంచరిస్తూ దొరికిన ఆహార పదార్థాలు తింటున్న దున్నపోతు... మూడు నెలలుగా తన ధోరణి మార్చుకుంది. ఇళ్ల ఆవరణలోకి ప్రవేశించి ఎండకు బెట్టిన గింజలను తినడం మొదలు పెట్టడంతో గమనించిన స్థానికులు దున్నపోతును అదలించేవారు. అయినా దున్నపోతు మొత్తం గింజలను తినేంత వరకూ అక్కడి నుంచి కదలకుండా ఉండడంతో కర్రతో కొట్టి తరిమేసేవారు. తనపై దాడి చేసిన వారు వీధుల్లో కనిపిస్తే దున్నపోతు కసితో రెచ్చిపోయి కుమ్మేస్తూ వచ్చింది. అప్పటి నుంచి దున్నపోతు వీధుల్లో కనిపిస్తే ప్రజలు భయపడి ఇళ్లలోకి పరుగు తీయడం మొదలు పెట్టారు. ఈ మూడు నెలల్లో 60 మంది గ్రామస్తులు దున్నపోతు దాడిలో గాయపడ్డారు. అయితే తొలిసారిగా బుధవారం ఓ మహిళపై దున్నపోతు దాడి చేయడంతో గ్రామస్తుల్లో భయాందోళనలు చోటు చేసుకున్నాయి. అధికారులు స్పందించి దున్నపోతును బంధించి, అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

నాడు శిల... నేడు రామయ్య

ఏడాది క్రితం శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నుంచి అనంతపురం మీదుగా కర్నూలు జిల్లా మంత్రాలయానికి చేర్చిన 200 టన్నుల బరువున్న ఏకశిల... నేడు రామయ్య రూపాన్ని సంతరించుకుని పూజలందుకుంటోంది. గత ఏడాది మార్చి 3న అనంతపురం జిల్లాలో ప్రవేశించిన శిలకు అడుగడుగునా ప్రజలు విశేష పూజలు చేశారు. ఏడాది తిరగకనే ఆ శిల కాస్త 56 అడుగుల ఎత్తైన సుందర రామయ్యగా రూపుదిద్దుకుంది. రామయ్య విగ్రహాన్ని ఈ నెల 22న మంత్రాలయంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆవిష్కరించారు. బెంగళూరుకు చెందిన అభయ శ్రీరామ సౌజన్యంతో రూ.8 కోట్ల వ్యయంతో ఈ అద్భుతం ఆవిష్కృతం కావడం విశేషం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



నాడు



నేడు

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

అనంతపురం: అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ.. తోటి ఉద్యోగులను సమన్వయం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి అన్నారు. ఎస్కేయూ అంబేడ్కర్ పాలక భవనంలోని వీసీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సూపరింటిండెంట్లతో తొలిసారిగా వీసీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వర్సిటీ పురోగతికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. పరస్పర సహకారంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక



ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: ఇటీవల నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మండల పరిధిలోని దుద్దేకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మనోజ్‌కుమార్, తనుష్, నందిని, అనూరాధ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం బాలమురళీకృష్ణ తెలిపారు. మండలంలో బెళుగుప్ప, అంకంపల్లి ఉన్నత పాఠశాలల నుంచి మేఘనా బాయి, కళ్యాణి, విరుపాపల్లి, హనిమరెడ్డిపల్లి గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి భావన, గణేష్‌లు ఎంపికయ్యారని ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు.

నేటి నుంచి పశుసంవర్ధక వారోత్సవాలు

బుక్కరాయసముద్రం: స్థానిక పశువైద్యశాలలో గురువారం నుంచి పశు సంవర్ధక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆశాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో భాగం పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ టీకాలు వేస్తామన్నారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లను చూపిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

బొమ్మనహాళ్: అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి ఆంధ్రలో విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 90 (90 ఎంఎల్) కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజినేయులు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ గ్రామానికి చెందిన పింజారి వన్నూరమ్మ కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి అమ్ముతుండగా గ్రామంలో అరెస్టు చేశారు. మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



బోయ బస్సయ్య (ఫైల్)

బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామానికి చెందిన బోయ బస్సయ్య (41) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 23న ఉరవకొండకు వెళ్తాను అని చెప్పి వెళ్లాడన్నారు. తిరిగి ఇంటికి రాలేదు. బస్సయ్య మతి స్థిమితం సరిగ్గా లేదన్నారు. బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే 9535355356 నంబరుకు సమాచారం ఇవ్వాల్సిని కోరారు.

దుకాణాలపై అధికారుల దాడులు



ఎరువుల దుకాణంపై కేసు నమోదు చేస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. వీపీ బజార్ సమీపంలో గల గౌరి శంకర్ ఫర్టిలైజర్ షాపులో లక్ష్మీ కంపెనీకి చెందిన స్ప్రైయర్‌లో ఎంఆర్‌పీ గాని, తయారీ తేదీ లేకపోవడంతో కంపెనీ నుంచి రూ.20 వేల అపరాధ రుసుం వసూలు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతపురం రహదారి ఆర్టీసీ డిపో వద్ద గల ఎస్ఆర్ ఆటో మొబైల్స్‌లో ఎల్ఈడీ లైట్ల విక్రయంలో కూడా నిబంధనలు ఉల్లఘించడంతో యజమానికి రూ.3 వేలు అపరాధ రుసం విధించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయనతోపాటు టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్, టెక్నీషియన్ సురేష్ పాల్గొన్నారు.

ఎన్ని జెండాలు జత కట్టినా..

వైఎస్సార్‌సీపీదే గెలుపు



రాప్తాడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



సమావేశానికి హాజరైన మహిళలు

- వైఎస్సార్‌సీపీకే మహిళల అండ
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి
- ఘనంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు

రాప్తాడు: ఎన్ని జెండాలు జత కట్టినా.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయం. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ఆడపడచులు జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం, ఎం.బండమీదపల్లి, మరూరు, గొందిరెడ్డిపల్లి, బుక్కచెర్లలో వైఎస్సార్ ఆసరా సంబరాలు జరిగాయి. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా నాలుగో విడతకు సంబంధించి రాప్తాడు మండలంలో 691 స్వయం సహాయక సంఘాలకు రూ.7.11 కోట్ల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను దాదాపుగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తానని నాడు మాట ఇచ్చిన జగన్.. నేడు నాలుగో విడత మాఫీ చేసి మాట నిలుపుకున్నారన్నారు. ఎన్నికల నాటికి డ్వాక్రా సంఘాల అప్పు రూ.25,500 కోట్లు ఉండగా.. అప్పు మొత్తం సంపూర్ణంగా రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. సంఘాల్లోని 1.04 కోట్ల మంది మహిళలు తీసుకుంటున్న అప్పుపై వడ్డీ రూ.5,500 కోట్ల మేరకు సున్నా వడ్డీ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. పిల్లల చదువుకు కూడా దాదాపు 50 లక్షల మంది తల్లుల ఖాతాల్లోకి రూ.26 వేల కోట్లు జగనన్న ఇప్పటికే పంపిణీ చేశారని తెలిపారు. అదేవిధంగా 45 సంవత్సరాలు దాటిన 31 లక్షల మంది మహిళలకు చేయూత పథకం ద్వారా రూ.14 వేల కోట్లు ఇప్పటికే అందజేయడం జరిగిందన్నారు. 31 లక్షల అక్కా చెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు, లక్ష కోట్ల విలువైన ఆస్తితో పాటు 22 లక్షల మంది అక్కా చెల్లెమ్మలకు రూ.50 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు.

చంద్రబాబును నమ్మొద్దు

చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదు. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు నాయుడు దిట్ట అన్నారు. అలాంటి వ్యక్తి మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దు అని ఎమ్మెల్యే కోరారు. ఇచ్చిన మాటపై చంద్రబాబు ఏనాడూ నిలబడలేదన్నారు. అటువంటి వ్యక్తికి వచ్చే ఎన్నికల్లో పొరపాటున కూడా మద్దతు ఇవ్వొద్దన్నారు.

బంగారు రుణాలు, డ్వాక్రా రుణాలు, రైతు రుణాలు, ఇంటింటికీ నిరుద్యోగ భృతి, రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణంతో ఎన్నో హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారన్నారు. పరిటాల కుటుంబం 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా ప్రజల గురించి ఏనాడు ఆలోచించ లేదన్నారు. పరిటాల సునీత గ్రామం పక్కనే ఒక వైపు పేరూరు డ్యాం, మరో వైపు బంగారు గనులు ఉన్నాయన్నారు. వారి పాలనలో డ్యాం పూర్తిగా ఎండిపోయిందని తెలిపారు. వారి పాలనలోనే బంగారు గనులు మూతపడ్డాయన్నారు. నేను ఎమ్మెల్యే అయిన వెంటనే పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకువచ్చానని వెల్లడించారు. త్వరలోనే బంగారు గనులు కూడా తెరిపిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ మునివేలు, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ వీరారెడ్డి, ఏపీఎం నల్లప్ప, సర్పంచులు ఉమాదేవి, ప్రభావతి, నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళలకు భరోసా



రాప్తాడు రూరల్: పొదుపు సంఘాల సభ్యులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: రానున్న ఎన్నికల్లో ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి, కాటిగానికాలువ గ్రామాలకు చెందిన పొదుపు మహిళా సంఘాల సభ్యులకు నాల్గో విడత 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలకు సంబంధించిన రూ. 39,12,471 మెగా చెక్కును పొదుపు సంఘాల సభ్యులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 'అమ్మ ఒడి', 'వైఎస్సార్ ఆసరా', 'వైఎస్సార్ చేయూత', 'జగనన్న చేదోడు' పథకాల ద్వారా కోట్లాది రూపాయలు మహిళల బ్యాంకుల ఖాతాల్లో జమ చేశారన్నారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములను రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది మహిళల పేరిట ఇంటి పట్టాలిచ్చారన్నారు. 22 లక్షల ఇళ్లు మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ఆడపడుచులు తాము జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నారన్నారు. సాయం చేసిన జగనన్నను ఎలా మర్చిపోతామని, అండగా ఉంటామని చెబుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, ఎంపీడీఓ పుల్లయ్య, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పెన్నోబులేసు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వైస్ సర్పంచ్ రమేష్, నాయకులు ఈశ్వరయ్య, బయన్న, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు పెంచాలి



డీఏవో ఉమామహేశ్వరమ్మతో సమావేశమైన పెద్దవడుగూరు పత్తి రైతులు

అనంతపురం అగ్రికల్చర్: కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)తో అమ్ముకునేందుకు వ్యవసాయశాఖ అధికారులు సహకరించాలని పెద్దవడుగూరు రైతులు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ (డీఏఓ)కు విజ్ఞప్తి చేశారు. మండలానికి చెందిన పలువురు రైతులు బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో డీఏఓను కలిశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా ప్రస్తుతం గుత్తి మార్కెట్ యార్డులో కొనుగోళ్లు మొదలు పెట్టారన్నారు. అయితే పత్తి నాణ్యతగా లేదని, అలాగే ఈ-క్రాప్ ఆధారంగా ఎకరాకు 4 క్వింటాళ్లకు మించి కొనుగోలు చేయలేమని చెబుతున్నట్లు తెలిపారు. గతేడాదికి సంబంధించి ఇళ్లలో నిల్వ చేసుకున్న పాతపత్తికి కూడా ఒక ధర నిర్ణయించి కొనుగోలు చేస్తే రైతులకు వెసులుబాటు లభిస్తుందన్నారు. ప్రస్తుతం నాణ్యమైన పత్తి క్వింటా రూ.7,020 ప్రకారం మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్, వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ నుంచి సహకారం అందిస్తే గట్టెక్కుతారని విన్నవించారు. పంట కోత ప్రయోగాల ఆధారంగా వచ్చిన దిగుబడులను బట్టి ఎకరాకు ఎంత కొనాలని ఉన్నత స్థాయిలో నిర్ణయిస్తారని డీఈఓ సమాధానమిచ్చారు. తమ చేతుల్లో ఏమీ లేదని స్పష్టం చేశారు. కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో మార్పులు చేర్పులు చేస్తే సాంకేతిక పరంగా ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. పత్తి రైతుల సమస్యపై కలెక్టర్, కమిషనరేట్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

సెంట్రల్ స్కూల్‌లో 'పరీక్ష పే చర్చ'



బహుమతులు అందజేస్తున్న వీఎంసీ సభ్యుడు, ఎస్కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.మద్దిలేటి

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లోని సెంట్రల్ స్కూల్‌లో పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 5 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమానికి ఎస్కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఏవీ రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఎస్.కరీంఖాన్ మాట్లాడుతూ.. పరీక్షల్లో పిల్లలు ఒత్తిడిని జయించడానికి, వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. అనంతపురం జిల్లా జవహర్ బాల్ భవన్‌కు చెందిన వి.పురందేశ్వరుడు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో వీఎంసీ (విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ) సభ్యుడు, ఎస్కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. మద్దిలేటి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

డీఈపై చర్యలు తీసుకోండి

అనంతపురం క్రైం: పీఏబీఆర్‌లో ఏఈగా పని చేస్తున్న రామచంద్రమూర్తిపై వివక్ష చూపుతున్న డీఈ విశ్వనాథ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఏబీఆర్ సబ్ డివిజన్ నంబర్-6 కూడేరులో పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్ రామచంద్ర మూర్తిని డీఈఓ విశ్వనాథ్‌రెడ్డి తక్కువ కులానికి చెందిన వాడు అంటూ వేధిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో అధికారి తీరును ప్రశ్నించిన పాపానికి ఏఈని తోటి ఉద్యోగుల ముందు హేళనగా మాట్లాడుతూ అవమాన పరిచినట్లు పేర్కొన్నారు. ఇది సరైనది కాదని మొరపెట్టుకున్న ఏఈని చెప్పలేని భాషలో దుర్భాషలాడడంతో బాధిత ఏఈ న్యాయం చేయాలని త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదు చేసి 48 గంటలు గడుస్తోందని ఇప్పటికీ సంబంధిత డీఈపై కనీస చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా ఇన్‌చార్జ్ బండారు శంకర్ ఎస్పీని కోరారు.

10 నుంచి రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట

అనంతపురం ఎడ్యుకేషన్: సత్యసాయి జిల్లా గోరంట్ల ఈడిగ (గౌడ) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10 నుంచి మూడు రోజుల పాటు రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను బుధవారం అనంతపురం నగరంలో వైఎస్సార్‌సీపీ బీసీ జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్‌గౌడ్, ఇతర ఈడిగ సంక్షేమ సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా గోరంట్ల ఈడిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గిరిధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణగౌడ్ మాట్లాడారు. అందరి సహకారంతో రూ.70 లక్షల వ్యయంతో గోరంట్లలో రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని కొత్తగా నిర్మించామన్నారు. ఫిబ్రవరి 10న సాయత్రం 4 గంటలకు గంగపూజతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 11న ఉదయం 6 గంటలకు ప్రాత:కాలపూజలు, జపాలు, మహాగణపతి, నవగ్రహ హవనము, అమ్మవారి జలక్షీరాది తదితర పూజలు ఉంటాయని పేర్కొన్నారు. 12న వేకువజామున 4:15 గంటలకు విగ్రహ ప్రాణప్రతిష్ట ఉంటుందని తెలిపారు. బీసీ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి అమ్మవారి విగ్రహ ప్రతిష్టను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోరంట్ల ఈడిగ సంఘం నాయకులు నారాయణ గౌడ్, వెంకట్ గౌడ్, కృష్ణ గౌడ్, సుధాకర్ గౌడ్, అనంతపురం జిల్లా ఈడిగ (గౌడ) సంఘం నాయకులు లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆంజనేయులు గౌడ్, బుర్రా ఆదినారాయణ గౌడ్, నాయనపల్లి రాజు గౌడ్, స్వరూప్ బాబు గౌడ్, రామ్మోహన్ గౌడ్, అనిల్ కుమార్‌గౌడ్, సురేంద్ర గౌడ్ ఈశ్వరయ్య గౌడ్, శివానంద గౌడ్, భాస్కర్ గౌడ్, చంద్రరాయుడు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



కనగానపల్లి: బాలికా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అంగన్వాడీలు



అనంతపురం రూరల్: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం రూరల్: బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీరాణి, భారతి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రుద్రంపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి మాట్లాడారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేన్నారు. పురుషులకు ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలికలు విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన, మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: మంచి విద్యావంతులుగా ఎదిగినప్పుడే బాలికలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం అంగన్వాడీల ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ బాలికల విద్యాభివృద్ధి, బాలికల రక్షణ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై తెలియజేశారు. హెచ్ఎం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఘనంగా శివబాలయోగి జయంతి



పూజల్లో పాల్గొన్న భక్తులు



అలంకరణలో శివబాల యోగి మహరాజ్ స్వామి

అనంతపురం కల్చరల్: నగర శివారులోని ఆర్టీటీ ఆఫీసు సమీపంలో ఉన్న ఆశ్రమంలో శివబాలయోగి మహరాజ్ స్వామి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో పేదలకు అన్నదానం చేశారు. అనంతరం దాతలను సన్మానించారు. ఆలయ ప్రెసిడెంట్ జూటురు అరవింద్, వైస్ ప్రెసిడెంట్ రత్నగిరి దేవరాజ్, మల్లికార్జున ప్రసాద్, లక్ష్మీనారాయణ, గోపి పాల్గొన్నారు.

నేత్రదానం

ధర్మవరం రూరల్: ధర్మవరం మండలం మల్లేనిపల్లికి చెందిన లక్ష్మీదేవి (67) అనే మహిళ మృతి చెందింది. విశ్వదీప సేవా సంఘం వారు బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి కుటుంబ సభ్యుల సహకారంతో విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అందత్వ నివారణ సంస్థ, హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ నాగరాజు మృతురాలి నుంచి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన దాత కుమారులు హనుమంతు, వెంకటేష్, కోడళ్లు పార్వతి, నాగలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఆర్‌వీ ట్రావెల్ ఎక్స్‌పో' ప్రారంభం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో బుధవారం ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్ సంస్థ ఆధ్వర్యంలో ట్రావెల్ ఎక్స్‌పో-2024 ప్రారంభమైంది. స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దేశ, విదేశీ యాత్రలకు సంబంధించిన టూర్ ప్యాకేజీలపై మంచి ఆఫర్లు ప్రకటించడంతో కస్టమర్లు భారీగా తరలి వచ్చారు. ఇంకా ఒక రోజు మాత్రమే అవకాశముందని, సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్ సంస్థ అధినేత రమణ సూచించారు.

చైతన్య విద్యాసంస్థల్లో క్యాట్ విజయోత్సవం

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం జోన్ పరిధిలో శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో గత డిసెంబర్‌లో నిర్వహించిన క్యాట్ లెవెల్-2 పరీక్షల్లో పలువురు విద్యార్థులు విజయదుందుభి మోగించారు. బుధవారం ఉత్తమ ప్రతిబ కనబరిచిన విద్యార్థులను ఏజీఎం సుబ్బారెడ్డి నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. క్యాష్ ప్రైజ్ విన్నర్స్‌గా 69 మంది విద్యార్థులు నిలిచారని తెలిపారు. ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, డీన్లు, సీ-బ్యాచ్ ఇన్‌చార్జ్‌లు, కో-ఆర్డినేటర్ ఉన్నారు.

కొండవీటి వెంకటకవి పురస్కారానికి ఆచార్య రాచపాలెం ఎంపిక

అనంతపురం సెంట్రల్: తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం కొండవీటి వెంకటకవి జయంతి జరగనుంది. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డికి కొండవీటి వెంకటకవి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గుట్టకిందపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి రామన్న రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. గుట్టకిందపల్లి గ్రామానికి చెందిన రామన్న బుధవారం రాత్రి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. రామన్నకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఆర్బీకేల్లో నమోదు చేయించండి

గుత్తి: పత్తి, కంది, జొన్న రైతులు తమ పంటల వివరాలను ఆర్‌బీకేల్లో నమోదు చేసుకునేలా చూడాలని ఏఓలు, ఏఈఓలను ఏడీఏ వెంకటరాముడు ఆదేశించారు. కంది పంట క్వింటాల్ రూ.9,370, జొన్న రూ.3,225, హైబ్రిడ్ జొన్న రూ.3,180, పత్తి రూ.7,020 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు



క్రికెట్ (మెన్) విజేతగా నిలిచిన రెవెన్యూ కాలనీ జట్టు

అనంతపురం: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలు బుధవారం ప్రారంభం అయ్యాయి. క్రికెట్ మెన్ విజేతగా మొదటి స్థానంలో రెవెన్యూ కాలనీ (వార్డు సచివాలయం-6) నిలిచింది. రెండో స్థానంలో రుద్రంపేట వార్డు (సచివాలయం -4), నాయక్ నగర్ సచివాలయం మూడో స్థానంలో నిలిచింది. ఉమెన్ క్రికెట్‌లో మొదటి స్థానం ఆదిమూర్తి నగర్, రెండో స్థానం న్యూ రెవెన్యూ కాలనీ, మూడో స్థానం ఏ.నారాయణపురం జట్లు నిలిచాయి. బ్యాడ్మింటన్ (మెన్)లో మొదటి స్థానం మిస్సమ్మ కాలనీ, రెండో స్థానంలో గిల్డాఫ్ స్కూల్, మూడో స్థానంలో అనంతపురం రూరల్, బ్యాడ్మింటన్ (ఉమెన్)లో మొదటి స్థానంలో రామ్‌నగర్-1, రెండో స్థానంలో అనంతపురం రూరల్, మూడో స్థానంలో అనంతపురం అర్బన్ నిలిచింది. నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చాటిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

నేటి నుంచి ఎన్‌ఎస్ఎస్ క్యాంప్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో గురువారం నుంచి అనంతపురం రూరల్ మండలం కురుగుంటలోని బాలయోగి గురుకుల బాలికల కళాశాలలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ ఓ ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు ఈ క్యాంప్ ఉంటుందన్నారు. క్లీన్ ఇండియా, మొక్కలు నాటడం, రక్త నిర్ధారణ పరీక్షలు, హెల్త్ కాంప్, ఓటుహక్కు వినియోగంపై అవగాహన, ఓటరు నమోదు కార్యక్రమం, ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన, డిజిటల్ లిటరసీ, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా మా క్షేదారుడైన చిన్నా సుధాకరరెడ్డి తండ్రి సి. చిన్న వరదారెడ్డి ప్రతివాది అయిన జొన్నకూటి శ్రీనివాసరెడ్డి తండ్రి జె. పుల్లారెడ్డి, వడియంపేట గ్రామం వారి పైన అనంతపురము జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో O.S. No. 540/2021 దావా వేసి అందులో I.A. 536/2021 నందు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని అటాచ్‌మెంట్ చేసుకొన్నాడు. కావున ఇతరులు ఎవరైనా కొన్నా అది చెల్లుబాటు కాదు అని తెలియజేయడమైనది.

షెడ్యూలు

పొడరాళ్ళ గ్రామ పొలం అనంతపురము రూరల్ మండలం వడియంపేట హైవేకి అనుకొని వున్న పొలం వివరం.

సర్వే నెం. 89లో 10-40 పైకి 8-40 పైకి 2-05 పైకి 0.68 సెంట్లు.

పి. నాగిరెడ్డి, వకీలు,
అనంతపురము, సెల్: 9247151463